# నేహాల



సాయి బ్రహ్మానందం గొర్తి

**చరిత్రకి బలైన స్వేచ్ఛ కథ**

1

(క్రీ.శ. 1400 నాటి కాలం)

భాద్రపద చంద్రుడు శరత్కాలంలోకి ప్రవేశించాడు.

శరన్నవరాత్రులు ప్రారంభమయ్యాయి.

విజయనగర రాజ్యమంతా విజయదశమి పండగ వాతావరణం నెలకొంది.

ప్రజల్లో ఆనందోత్సాహాలు వెల్లి విరుస్తున్నాయి. ఏడాదిలో అతి ముఖ్యమైన పండగని అందరూ తమ తమ స్థాయిని బట్టి జరుపుకుంటున్నారు. ప్రతీ గృహమూ అందంగా అలంకరించబడింది. ఇంటికి సున్నాలు కొట్టడంతో శ్వేతకళతో మెరుస్తున్నాయి. పచ్చటి మామిడి తోరణాలు నగరమంతా స్వాగతం పలుకుతున్నాయి. ఇంద్రధనస్సు నేలపై విశ్రాంతి తీసుకుంటుందా అన్నట్లు రంగవల్లులు ప్రతీ ఇంటి ముందూ వీనులవిందు కలిగిస్తున్నాయి.

విజయనగర వీధులన్నీ పూల తోరణాలతో నిండి కళకళ్ళాడుతోంది.

ప్రజలే ఇలావుంటే రాజ మందిరాన్ని వర్ణించనవసరం లేదు. కళ్ళు జిగేలుమనిపించేలా రాజమందిరాలు అలంకరింపబడ్డాయి. పురవీధులన్నీ

వసంతశోభతో నిండిపోయాయి.

విజయనగర మహారాజు దేవరాయలకి క్షణం తీరికలేదు. ఏటా విజయదశమి ఉత్సవాలు జరిగినా ఈ ఏడాది ఒక ప్రత్యేకత ఉంది. దేవరాయలు ఎంతో సమర్థనీయంగా బహమనీ రాజుల్ని ఎదుర్కొన్నాడు. గుల్బర్గాని దాటి రానీయకుండా ఎంతో చాకచక్యంగా యుద్ధం చేసి నిలువరించ గలిగాడు. దేవరాయల విజయం ప్రజలకి నిజంగా పండగే!

అదొక్కటే కాదు దేవరాయలు కళింగ దేశాన్ని పాలించే గజపతుల వంశానికి చెందిన అందాల భామ ఉమాదేవిని వివాహం చేసుకొని పట్టపురాణిగా ప్రజలకు దర్శనమివ్వబోతున్నాడు. దేవరాయలకీమె నాలుగో పట్టమహిషి.

ఈ సందర్భంగా మహానవమి దిబ్బ వద్ద హరికథలూ, నాట్య ప్రదర్శనలూ, యక్షగానాలూ ఏర్పాటు చేసాడు. దేశం నలుమూలలనుండీ కళాకారుల్ని ఆహ్వానించాడు. వాయిద్య కారుల్నీ, సంగీత విద్వాంసుల్నీ రప్పించాడు. పండితుల్నీ, సాహిత్య కారుల్నీ పిలిపించాడు. నగరమంతా ఎంతో కోలాహలంగా ఎక్కడ చూసినా సంబరాలతో నిండి వుంది.

ఇవన్నీ చూడ్డానికి రాజ్యం నలుమూలల్నుండి అశేష జనవాహిని తరలి వస్తోంది.

మహానవమి దిబ్బ మీద జరిగే ప్రతీ సాంస్కృతిక కార్యక్రమాన్నీ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నాడు దేవరాయలు. శత్రువులతో యుద్ధాన్ని ధైర్యంగా ఎదుర్కొని విజయం చేకూర్చిన వారికి ప్రత్యేక సత్కారాలు చేయడానికి పూనుకున్నాడు. విజయ దశమి సందర్భంగా తన దండనాయకుల్ని సన్మానించడానికి సన్నాహాలు చేస్తున్నాడు.

ఆనాడు ఆశ్వీజ శుద్ధ పాడ్యమి.

ఉదయాన్నే లేచి అభ్యంగన స్నానం ఆచరించి, సంగమ వంశారాధ్య దైవమైన విరుపాక్షుని సతీసమేతంగా దర్శించి పూజించాడు. పండితులకీ, అతిథులకీ ప్రత్యేక విందు ఏర్పాటు చేసాడు. తదనంతరం వినోద కార్యక్రమాలు తిలకించడానికీ, ప్రజలని కలవడానికీ మహానవమి దిబ్బకి వెళ్ళాలి. మంత్రులూ, అనుచరులూ అన్నీ దగ్గరుండి చూసుకుంటున్నారు. నాడు సత్కారం పొందే పండితుల్ని ప్రత్యేకంగా రాజ భవనానికి ఆహ్వానించాడు.

వచ్చిన వారిలో వేదరాయశర్మ కూడా ఉన్నాడు. వేదరాయ శర్మ సంగీత సాహిత్యాల్లో విశేష ప్రావీణ్యముంది. సంస్కృత, కన్నడ తెలుగు భాషల్లో అపార పరిజ్ఞానముంది. నాట్య శాస్త్రంలో కూడా ఇతనికి ప్రవేశముంది. ఇతను రాయచూరు సమీపానున్న ముద్గల్ నివాసి. అక్కడొక పాఠశాలలో అందరికీ సంగీత, నాట్యాలపై విద్యా బోధ చేస్తూ వుంటాడు. ఈ దసరా ఉత్సవాలకోసం విజయనగరానికి ప్రత్యేక ఆహ్వానితుడిగా విచ్చేసాడు. తన వద్ద నాట్యం అభ్యసిస్తున్న శిష్యులతో ఒక సంగీత యక్షగాన రూపకాన్ని ప్రదర్శించబోతున్నాడు.

వేదరాయశర్మ దేవరాయల్ని కలవడం ఇదే మొదటి సారి కాదు. గతంలో అనేకసార్లు రాజమందిరానికి విచ్చేసాడు. దేవరాయలకి వేదరాయ శర్మంటే ఎంతో గౌరవం. గురుతుల్యుడిగా భావిస్తాడు.

వేదరాయ శర్మతో పాటు అతని ప్రియ శిష్యుడు రేవన్న కూడా విజయనగరం వచ్చాడు. విజయనగరం గురించి వినడమే కానీ చూడ్డం ఇదే ప్రథమం రేవన్నకి. విజయనగర శోభని చూసి ఆశ్చర్య పోయాడు. సిరిసంపదలతో తులతూగుతున్న నగరం అతన్ని సంభ్రమాశ్చర్యాలకి గురిచేసింది. నాటి కార్యక్రమంలో అతనూ నాట్య ప్రదర్శన చేస్తున్నాడు. వేదరాయశర్మకి అనుంగుడైన ఇతను గురువుగారికేం కావాలన్నా అన్నీ దగ్గరుండి శ్రద్ధగా చేస్తాడు. అందుకే వేదరాయశర్మ రాజమందిరానికి అతన్నీ తోడ్కొని పోయాడు.

కళ్ళు చెదిరే రాజమందిరాలు విస్తుబోయి చూసాడు రేవన్న. రాజ ప్రాసాదాలు బయటనుండి చూడ్డమే కానీ ప్రత్యక్షంగా చూసెరగడు.

సైనికుల ద్వారా రాజమందిర ప్రవేశ అనుమతికోసం దేవరాయలకి కబురు పంపించాడు వేదరాయ శర్మ. మాహారాజుల అనుమతి లభించగానే రాజ మందిరంలోకి ప్రవేశించారు. దేవరాయల గురించి రేవన్న వినడమే కానీ ఎప్పుడూ చూళ్ళేదు. ఆరడగుల మనిషి. కాస్త చామన ఛాయ రంగులో వున్నా మొహంలో వర్చస్సు ఉంది. మంచి శరీర ధారుడ్యంతో రాజఠీవి ఒడుతూ ఉన్నాడు.

దేవరాయల్ని చూడగానే అత్యంత వినయంతో నమస్కరించి మాహారాజు కీర్తిని ప్రస్తుతిస్తూ రాగయుక్తంగా స్తుతించాడు వేదరాయ శర్మ.

*తుంగాతరంగ రమణీయ దృశ్య విహారం*
*విద్యారణ్య స్థాపిత విజయపీఠం*
*శారదా కటాక్ష హంపీ విరూపాక్షం*
*శ్రీ దేవరాయ పాలిత జయ విజయనగరం*

అది వినీ రాజు గారు ఎంతో సంతోషంతో వేదరాయ శర్మకి స్వాగతం పలికాడు.

"దేవరాయా! నీ వినయమే నీకు కవచము. పెద్దల ఎడల నీ భక్తే నీకు విజయం. మీ దర్శన భాగ్యంతో నేనూ, నా శిష్యుడు రేవన్నా అమితానంద భరితులమయ్యాము. మీరిచ్చే గౌరవం కన్నా కళాకారులకి విలువైనదేముంటుంది మహారాజా? మీ పాలనలో సంగమ వంశప్రతిష్ట మరింత ద్విగుణీకృతమవుతోంది." వేదరాయశర్మ తన సంతోషాన్ని వ్యక్త పరిచాడు.

"వేదరాయా! పెద్దల ఎడల వినయమూ, యుద్ధాల్లో శౌర్యమూ మా సంగమ వంశీయులకి వంశపారంపర్యంగా వచ్చాయి. విజయనగర స్థాపకులైన మా తాతగారు హరిహరులూ, మా తండ్రిగారూ ఇవన్నీ ఆచరణలో చూపించి మాకు ఆదర్శప్రాయులుగా నిలిచారు. ఇంతకు ముందే మా వంశ పెద్దల గురించి ముచ్చటిస్తూండగా మీరొచ్చారు. పండిత వర్యా అలా నిలబడే ఉన్నారు? ఆసీనులు కండి." దేవరాయలు అన్నాడు.

వేదరాయశర్మ ఆసీనుడు కాగానే వెనుకనే రేవన్నా నిల్చున్నాడు.

దేవరాయల పక్కనే అతని కొత్త రాణి ఉమాదేవి కూర్చుని ఉంది. కొంత దూరంలో సింహాసనంపై ఒక కొత్త వ్యక్తి కూర్చున్నాడు. వేదరాయశర్మకి రాజ కుటుంబీకులు దాదాపు అందరూ పరిచయమే! దేవరాయలు అతన్ని పరిచయం చేసాడు.

"వేదరాయా చెప్పడం మరిచాను. ఈయన మా పట్టమహిషి ఉమాదేవికి స్వయాన తమ్ముడు. పేరు నరేంద్ర గజపతి. కొంతకాలం మా రాజ్యంలోనే ఉంటారు. " అని చెప్పి, నరేంద్రగజపతి వైపు తిరిగి - "ఈయన శ్రీ వేదరాయశర్మగారు. వీరి తండ్రిగారు మా ఆస్థాన పురోహితులు. మా తండ్రిగారు హరిహరులకి ఎంతో ఆప్తులు. ఏ శుభకార్యం తలపెట్టినా వీరి తండ్రిగారిని సంప్రదించకుండా చేసేవారు కాదు. అదే సాంప్రదాయాన్ని మేమూ పాటిస్తున్నాము. ఏటా ఈ మహానంది దిబ్బ మీద విజయదశమి వేడుకలు జరపాలన్నది వీరి తండ్రిగారి ప్రోద్బలంతోనే జరిగిందని చెప్పేవారు." నరేంద్ర గజపతికి వివరించాడు దేవరాయలు.

కొంత సేపు యుద్ధ విషయాలు ముచ్చటించాక దేవరాయలు రేవన్నని బయటకి పంపించి, వేదరాయశర్మని మాత్రం అక్కడే ఉండమన్నాడు.

"వేదరాయా! మీతో ఒక అంతరంగిక విషయం చర్చించాలి. బహమనీ సుల్తానులతో విజయం సాధించినా వారి వల్ల ముప్పు ఎప్పుడూ ఉంది. దెబ్బతిన్న శత్రువు అవకాశంకోసం ఎదురు చూస్తూనే ఉంటాడు. ఈ విజయ నగర కోట ప్రాకారం కేవలం ఎనిమిది మైళ్ళ వరకే ఉంది. ఈ ప్రాకారం చుట్టూ మరో ప్రాకారం కట్టాల్సిన అవసరముంది. దానికి మీరొక మంచి ముహూర్తం చూసి చెప్పండి. ఇంతకు ముందు తుంగభద్ర ఎగువునున్న ప్రాకారానికి మీ తండ్రిగారే ముహూర్తం పెట్టారు. మా ఆస్థాన పండితులతో చర్చించి చెప్పండి. చైత్రమాసంలో ఈ పని మొదలెడదామని ఉంది. వేసవికల్లా ముగించేద్దామన్న ఆలోచనిది. వీలయితే మీరు ముహూర్తానికి మరోసారి

విజయనగరం విచ్చేయాల్సి వుంటుంది. ఈ నవరాత్రి ఉత్సవాలు ముగిసాక మీతో వివరంగా మాట్లాడతాను. ఈ ప్రాకార నిర్మాణానికి నరేంద్ర గజపతే నిర్వహణాధికారిగా ఉంటారు.''

దేవరాయలు బహమనీ సుల్తానులతో ఓ చిన్న యుద్ధం ముగించి రెండు మాసాలు కూడా కాలేదు. సుల్తాను సైన్యాన్ని రాయచూరు వద్దే నిలువరింప చేసాడు.

''చిత్తం ప్రభూ! ముసల్మానుల దాష్టీకాలు మాకు తెలుసు. రాయచూరు పరిసర ప్రాంతాల్లో వాళ్ళు చేసిన భీభత్సం కళ్ళారా చూసాం. సత్వరమే ప్రాకార నిర్మాణం చేయడం మంచి ఆలోచన. నా వంతు సహాయం నేనూ చేస్తాను. చైత్రమాసంలో తప్పకుండా వస్తాను. మీ ఆజ్ఞ '' వేదరాయ శర్మ తన అంగీకారాన్ని చెప్పాడు.

దేవరాయలు పక్కనే ఉన్న అంతరంగికుణ్ణి పిలిచి చెవిలో ఏదో చెప్పాడు. ఆయన అక్కడనుండి వెళిపోయాడు. వేదరాయ శర్మకీ, నరేంద్ర గజపతికీ ఏమీ అర్థం కాలేదు. రాజుగారినడిగే సాహసం చేయలేక ఏమిటన్నట్లుగా చూసారు. కొంత సేపయ్యాక అంతరంగికుడు ఒక వ్యక్తిని వెంట బెట్టుకొని వచ్చాడు. వచ్చినతను చూడ్డానికి ముసల్మానులా ఉన్నాడు. గడ్డం బాగా పెరిగి ఉంది. మీసం లేదు. వస్తూనే దేవరాయలకి నమస్కరించాడు.

''వేదరాయా! ఇతని పేరు మసూమ్. రాయచూరు నివాసి. పరిసర ప్రాంతాల్లో సుల్తానుల కదలికల్ని కనిపెట్టమని వేగుగా ఇతన్ని నియమించాము. ప్రపంచానికి ఇతను మసూమ్ గానే పరిచయమయినా, ఇతని అసలు పేరు బసప్ప. ఇతను ఎప్పుడైనా మీకు ఏ సమాచారమయినా అందజేస్తే మీరు మాకు తక్షణమే తెలియజేయాలి. అలాగే మీ ముద్గల్ ప్రాంతంలో మీకెవరి మీదయినా అనుమానముంటే ఈ బసప్పకి కబురు పంపించడు చాలు. ఈ మసూమ్ విషయం ఎవరికీ తెలియకుండా అత్యంత గోప్యంగా ఉంచాలి. ముసల్మానుల వల్ల మనకి ఎప్పుడైనా ఉపద్రవం రావచ్చు. అన్నింటికీ సిద్ధంగా ఉండడంకోసమే ఈ ప్రయత్నం. దీనికి విజయనగర వాసులుగా మీ సహాయం కావాలి.'' అతన్ని పరిచయం చేస్తూ దేవరాయులన్నాడు.

''అలాగే మహారాజా! మీరు చెప్పినట్లుగానే చేస్తాను. బసప్పా - నువ్వు నన్ను కలవడానికి ముద్గల్ ఎప్పుడైనా రావచ్చు. నా పేరు ముద్గల్లో అందరికీ పరిచయమే. ఎవర్నడిగినా మా ఇల్లు చూపిస్తారు.''

''అలాగే పండిత వర్యా!'' మసూమ్ నమస్కరిస్తూ అన్నాడు.

కొంతసేపు ముసల్మానుల గురించి చర్చ జరిగాక మసూమ్ అక్కడనుండి నిష్క్రమించాడు.

వేదరాయశర్మ కూడా మహారాజు వద్ద శలవు తీసుకున్నాడు. బయట ఎదురుచూస్తున్న రేవన్నకి సహనం నశించింది. ఎంతసేపటికీ గురువు గారు రాకపోయే సరికి ఓపిక సడలింది. మహారాజుతో గురువు గారికి మంతనాలేమిటాన్న ఆతుత పెరిగింది.

గురువు గారు బయటకి రాగానే అదే ప్రశ్నించాడు.

''అది రాజ్య అంతరంగిక విషయం. ప్రభువుల అనుమతి లేకుండా ఎవరికీ చెప్ప కూడదు.'' గురువుగారు విషయాన్ని అక్కడితో కత్తిరించేసారు. మరలా అడిగే ధైర్యం రేవన్నకి లేదు.

వాళ్ళ విడిది గృహానికి వెళుతూ దారిలో మరో విధంగా అదే ప్రశ్నడిగాడు. రహస్యం తెలుసుకోవాలన్న ఆత్రం ఎక్కువయ్యిందతనికి.

''గురువు గారూ! నవరాత్రులయ్యాక మనం ఎప్పుదు ముద్గల్ తిరిగి వెళతాము?''

''ఉత్సవాలు ముగిసాక బహుశా నేనో రెండు దినాలు ఉండాల్సి వస్తుందేమో! తెలీదు. రేపు మిగతా పండితులతో చర్చించాక తెలుస్తుంది. ఈ లోగా నేనూ నా లెక్కల ప్రకారం ఓ మంచి ముహూర్తం పెట్టాలి..''

''ముహూర్తమా? దేనికి? మరో ఉత్సవమా? లేక ఏదైనా కొత్త మందిరానికా స్వామీ?''

"మందిరానిక్కాదు. అలాంటిదే అనుకో. అన్నట్లు నువ్వు విజయనగరం రావడం ఇదే ప్రథమం కదూ? చూసావా ఈ విజయనగర వైభవం. ఎంత సుందరంగా ఉందో కదా? ఈ నగరం మొత్తం చూడ్డానికి వారం పైనే పడుతుంది." అంటూ వేదరాయశర్మ మాట మార్చాడు.

రేవన్నకి ఏదో నిర్మాణమన్నది అర్థమయ్యింది. ఇహ పొడిగించ లేదు. ముద్గల్ వెళ్ళాక గురువుగారి నుండి ఎలా రాబట్టాలో అతనికి తెలుసు. అతని తెలివి తేటలమీద అతనికి నమ్మకం ఎక్కువే! తనూ తెలివిగా మాట మార్చి వేరే విషయాలు మాట్లాడాడు.

ఆనాడు మధ్యాహ్నం మహానవమి దిబ్బ వద్ద విజయదశమి ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. అశేష ప్రజానీకం సుల్తానులపై దేవరాయుల విజయాన్ని శ్లాఘించారు. దేవరాయులు తన కొలువులో ఉన్న దండనాయకుల్ని, యుద్ధంలో ప్రాణాలకి తెగించి పోరాడిన సైనికుల్నీ సత్కరించాడు. వేదరాయలుకి సత్కారం జరిగింది. ఉత్సవాల్లో అందంగా అలంకరింపబడిన ఏనుగులూ, గుర్రాలతో మహానవమి దిబ్బ దగ్గర ఊరేగింపు జరిగింది. పగటివేషగాళ్ళూ, భోగం మేళాలతో ఎంతో కొలాహలంగా ఉందా ప్రదేశం. సాయంత్రం వేదరాయశర్మ శిష్య బృందం ఒక నాట్య ప్రదర్శనిచ్చారు. అందులో రేవన్న కూడా పాల్గొన్నాడు. రాజ్యం నలుమూలల నుండీ జనవాహిని తరలి వచ్చారు. ఆనందోత్సవాల్లో పాలు పంచుకున్నారు.

దేవరాయుల విజయానికి ప్రజలే ప్రతీక అన్నట్లుగా ఉందా ప్రదేశం. మహారాజులకి ప్రజల మీద ప్రేమ ఉండాలి. ప్రజలకి పాలించే వారి మీద నమ్మకం ఉండాలి. అప్పుడే రాజ్యం సుభిక్షంగా ఉంటుంది. ప్రజల సహకారమే రాజులకి జయం. రాజుల దక్షతే ప్రజల విజయం. ఈ చిన్న సూత్రం దేవరాయలు ఎప్పుడూ మర్చిపోలేదు. అందుకే అది విజయ నగరమయ్యింది.

000000000000000

మర్నాడు ఉదయం వేదరాయలు విరూపాక్ష దేవాలయానికి రేవన్నతో కలిసి వెళ్ళాడు. తుంగభద్రా నదీ తీరాన ఉన్న విరూపాక్షాలయం రేవన్నకి బాగా నచ్చింది. ఎంతో శిల్ప సంపద నిండి ఉన్న ఆలయాన్ని అతను విస్తుపోయి చూసాడు. పుట్టి బుద్ధెరిగాక కవితల్ త్రయంబకేశ్వరాలయం తప్ప ఇంకేమీ చూళ్ళేదు. త్రయంబకేశ్వరాలయమే అతని దృష్టిలో అతి పెద్ద దేవాలయం. దేవాలయ గాలిగోపురం ఆకాశాన్ని తాకుతోందా అన్నట్లుగా ఉంది. అంతెత్తున గాలిగోపురం ఎలా నిర్మించారన్నదే అతనికి పెద్ద ప్రశ్నగా అనిపించింది. విరూపాక్షాలయం చుట్టూ చాలా కోతులు కనిపించాయి. ముద్గల్లో కోతినయితే చూసాడు గానీ మరీ ఇన్ని వందల కొద్దీ కోతులా? ఇదే గురువుగారితోనూ అన్నాడు.

"గురువు గారూ! ఎన్ని కోతులో ఇక్కడ? ఆశ్చర్యంగా ఉంది."

"అదా! నీకు రామాయణం తెలుసు కదా? రామాయణంలోని కిష్కింధే ఈ ప్రదేశమని అంటారు. నాకూ మా పూర్వీకుల ద్వారానే తెలిసింది. ఈ విరూపాక్షాయలయం అతి ప్రాచీనమైంది. రేవన్నా, నీకోక విషయం తెలుసా? ఇక్కడే విద్యారణ్య స్వామి చేతుల మీదుగా ఈ విజయ నగర సామ్రాజ్య స్థాపనకి నాందీ ప్రస్తావన జరిగింది."

రేవన్న తెలీదన్నట్లు తలాడించాడు. వేదరాయశర్మ వివరాలు చెప్పడం మొదలు పెట్టాడు.

"ఈ విజయనగరం గురించి నాకు తెలుసున్న విషయాలు చెప్తాను. విను. ఇది సుమారు వందేళ్ళ క్రితం నాటి మాట. కొన్ని మా తండ్రిగారు చెప్పారు. నోటా ఈనోటా వినగా తెలిసిందే ఎక్కువ. అందులో ఏది వాస్తవమన్నది ఖచ్చితంగా చెప్పలేను. అయినా చెప్తాను. వందేళ్ళ క్రితం తుంగభద్రా, కృష్ణా నదులకు దిగువున ఉన్న రాజ్యాలు ఎప్పుడైనా అంతఃకలహాలతో యుద్ధాలు చేసేవారు తప్ప, మొత్తానికి ఇక్కడ ప్రశాంతంగానే ఉండేది. ఉత్తరాదిన ముసల్మానుల ఆక్రమణల వల్ల చాలా రాజ్యాలు కూలిపోయాయి."

రేవన్న శ్రద్ధగా వింటున్నాడు. విజయనగరం వచ్చాక అతనికి రాజుల గురించీ, రాజ్యాల గురించీ తెలుసుకోవాలన్న కొత్త ఉత్సాహం వచ్చింది.

దక్షిణాన తెలుగు భాషా, సంస్కృతులకు నిలయమైన ఓరుగల్లు సకల సంపదలతో విరాజిల్లుతోంది. ఓరుగల్లుని కాకతీయులు స్థాపించారు. అత్యంత పాలనా దక్షతలో కాకతీయుల ఓరుగల్లు ప్రజల సంతోష, సౌఖ్యాలకి నిలయమయ్యింది. కాకతీయుల ప్రాభవం పలుదిశలా దుందుభి మ్రోగించింది. అది చుట్టుపక్కల రాజ్యాల వారికి కన్ను కుట్టేలా చేసింది.

కాశీకి దగ్గర్లో ఢిల్లీ రాజ్యం ఉండేదట. ఆరాజ్యం మహమ్మదీయుల ఆధీనంలో ఉండేది. ఇటు ఉత్తరాదిన మహమ్మదీయ రాజులు ఢిల్లీ నుండి దక్షిణాదిపై పట్టు సాధించడానికై పలు యుద్ధాలూ చేసారు. నూట పాతికేళ్ళ క్రితం ఢిల్లీ సుల్తాన్ జలాలుద్దీన్ అల్లుడూ, సైన్యాధికారీ అయిన అల్లా ఉద్దీన్ ఖిల్జీ అతి కష్టమ్మీద దేవగిరిని ఆక్రమించుకున్నాడు. దేవగిరి పేరు దౌలతాబాదుగామార్చి, మామ గారైన జలాలుద్దీన్‌కి వెన్నుపోటు పొడిచి, తనకి తానే రాజుగా ప్రకటించుకొని అల్లా ఉద్దీన్ ఖిల్జీ ఢిల్లీకి రాజయ్యాడని చెబుతారు.. ఇతను అతి క్రూరుడు. హిందువులని ఊచకోత కోసేవాడట. బలవంతంగా హిందువుల్ని తన మతంలోకి మార్పించేవాడని అంటారు. స్త్రీలను విచక్షణారహితంగా చెరిచేవాడట. ఖిల్జీ కన్ను దక్షిణాన ఓరుగల్లు పై పడింది. సిరిసంపదలతో తులతూగుతున్న ఓరుగల్లుని ఎలాగైనా స్వాధీన పరుచుకోవాలన్న కోరిక బలంగా పెరిగింది. దౌలతాబాద్ తమ స్వాధీనంలోకి తెచ్చుకున్నా ఓరుగల్లు మాత్రం చేతికి చిక్కలేదు. ఓరుగల్లునెలాగైనా ఓడించాలన్నదే అతని ఏకైక ధ్యేయం."

"ఓరుగల్లు ఇక్కడికి ఎంత దూరంలో ఉంది?"

"రాయచూరికి సుమారు వంద క్రోసుల దూరంలో ఉండి ఉండవచ్చు. నేనూ ఎప్పుడూ అటు వైపు వెళ్ళ లేదు. కాకపోతే మనం ఉండే ప్రాంతానికి ఈశాన్యాన ఉందని మాత్రం తెలుసు.

ఢిల్లీ రాజయ్యాక పాలనా పరమైన ఇబ్బందుల వల్ల ఆ పనిని తన దండనాయకుడికప్పగించాడు. కాకతీయుల రాజుల తీవ్ర ప్రతిఘటన వల్ల ఆ దండనాయకుడు వెనుతిరిగాడు. కొంతకాలమయ్యాక రెండో సారి దండెత్తి హనుమకొండ కోటని స్వాధీన పర్చుకున్నాడు. ఓరుగల్లు మాత్రం అతని వశం కాలేదు. అప్పటి ఓరుగల్లు రాజు ప్రతాపరుద్రుడు రాజకీయంగా దండనాయకునితో బంగారు కానుకలూ, ధనమూ ఇచ్చి ఒడంబడిక చేసుకున్నాడు. ఢిల్లీ రాజ్యంలో గొడవలు జరిగాయి. అప్పుడు ఖిల్జీ పాలన ముగిసి కొత్తగా తుగ్లక్‌లు వచ్చారు. ఈలోగా ప్రతాపరుద్రుడు స్వయం ప్రతిపత్తి ప్రకటించుకొని మిగతా కోటల్ని ఓరుగల్లు ఆధీనంలోకి తెచ్చుకున్నాడు. ఢిల్లీ రాజు తన కొడుకు ఉలుగ్‌ఖాన్ని ఓరుగల్లుపై దండయాత్రకి పంపాడు. ప్రతాపరుద్రుడి చేతిలో ఓడిపోయి వెనుదిరిగిన ఉలుగ్‌ఖాన్ నెల తిరక్కుండా అతి పెద్ద సైన్యంతో మరోసారి దండెత్తి వచ్చాడు. యుద్ధంలో ప్రతాప రుద్రుడు పరజాయం చవిచూసాడు. ఎన్నో యుక్తులూ, కుయుక్తులతో ప్రతాప రుద్రుని యుద్ధంలో ఓడించి ఓరుగల్లుని సొంతం చేసుకున్నాడు.

ఓరుగల్లు కూలిపోయింది. "

చరిత్ర చెబుతూ మధ్యలో ఆపేసాడు వేదరాయశర్మ. మాటల్లో తెలీలేదు చాలా దూరం నడిచొచ్చారని. అలసటతో దారి పక్కనే ఉన్న బండరాయి పైన చతికిల బడ్డాడు.

"అదేమిటి గురువు గారూ? అప్పుడే అలసి పోయారా?" రేవన్న ప్రశ్నించాడు.

"నీలా నేనేమయినా ఇరవయ్యేళ్ళ వయసు వాడినా నాయనా? నాకు ఆరుపదులు దాటాయి. మనసు ఉత్సాహంగా ఉన్నా శరీరం ఒక్కోసారి సహకరించదు."

అక్కడ కొంత సేపు విశ్రమించాక మరలా బయల్దేరారు. రేవన్నకి ఓరుగల్లు కూలిపోయాక తరువాతేమయ్యిందన్న ఉత్సుకత బయల్దేరింది. గురువుగారు బయల్దేరుదామనగానే మిగతాది చెప్పమని అడిగాడు. వేదరాయశర్మ ఇంతకు ముందు చెప్పింది కొనసాగించడం మొదలు పెట్టాడు.

"ప్రతాపరుద్రుణ్ణి, మంత్రుల్నీ, అతని ప్రధాన దండనాయకులిద్దర్నీ బందీలుగా ఢిల్లీకి తీసుకుపోయాడు ఉలుగ్‌ఖాన్. ఈ ఉలుగ్‌ఖాన్నే మహమ్మద్ బిన్ తుగ్లక్ అని కూడా అనేవారు. ఢిల్లీ రాజయ్యాక పేరు మార్చుకున్నాడు.

తరువాత ప్రతాపరుద్రుణ్ణి బందీలుగా ఉన్న అతని దండనాయకులు తప్పించారు. ఆ సంఘటనలో ప్రతాపరుద్రుడు అక్కడొక నదిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రతాపరుద్రుని దండనాయకుల్ని బలవంతంగా ముస్లిం మతంలోకి మార్పించి ఓరుగల్లు కోటకి పరిపాలనా నిమిత్తమై పంపాడు తుగ్లక్.

ఓరుగల్లు ముస్లిం రాజుల వశమయ్యాక దగ్గర్లో ఉన్న కొండవీడు, కొండపల్లి, రాజమహేంద్రవరం, నిడదవోలు, కొలనువీడు కోటలపైనా వీరి కన్ను పడింది. మెల్లగా వాటిని కూడా ఆక్రమించుకున్నారు. దక్షిణాన ఉన్న రెండు నదులు తుంగభద్ర,, కృష్ణాల వరకూ ఉన్న ప్రదేశాలని వీళ్ళు ఆక్రమించుకున్నారు. చిన్న రాజ్యాలన్నీ చెల్లా చెదురయ్యాయి. ప్రజలు భయభ్రాంతులకు గురయ్యి శాంతి కరువయ్యింది. మెల్ల మెల్లగా దక్షిణాదికి దిగువనున్న రాజ్యాల వైపు ప్రజల వలసలు మొదలయ్యాయి.

మా ముత్తాతలు ఓరుగల్లు నుండి ఆనెగొందికి వలస వచ్చారు. మా తాతగారు చేసిన సేవకి మెచ్చి అప్పటి రాజు హరిహర రాయలు మాకు ముద్గల్లో కొంత భూమిని దానం చేసాడు. అందువల్ల మా పూర్వీకులు విజయనగరం నుండి ముద్గల్‌కి వచ్చేసారు. అయినా మాకు విజయనగరంతో రాకపోకలు తగ్గలేదు. మా తండ్రి గారు హరిహరరాయల కొలువు లోనూ, బుక్క రాయల కొలువులోనూ పనిజేసారు.

అదలా ఉంచితే -

ఎగువ దక్షిణాదిన పట్టు సాధించాక బిన్ తుగ్లక్ దృష్టి ఆనెగొంది కోటపై పడింది. ఆనెగొందినాక్రమించుకుంటే దిగువనున్న హొసల రాజ్యాన్ని అతి సులువుగా జయించవచ్చనీ పథకం వేసాడు. సరైన సమయం కోసం ఎదురుచూస్తూ, ఈలోగా తన ప్రధాన సైనికాధికారులతో యుద్ధ మంతనాలు మొదలెట్టాడు. ఈ బాధ్యత పర్యవేక్షణ, ముస్‌లిం మతం మార్చుకున్న ఒకప్పటి ప్రతాపరుద్రుని ప్రధాన దండనాయకులిద్దరికీ అప్పజెప్పాడు. కూలిన ఓరుగల్లులో ప్రధాన సైనికాధికారులుగా ఓ వెలుగు వెలిగిన చోటే అక్కడి ముస్లిం సైనికాధికారుల క్రింద పనిజేయడం వారిద్దరికీ ఇష్టంలేక పోయింది. తుగ్లక్ పన్నాగాలు వీళ్ళిద్దర్నీ కకావికలు చేసాయి. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఒప్పుకున్నారు. లేదంటే వారి ప్రాణాలకే ముప్పొస్తుందని వారికి తెలుసు. తమచేత్తో వాళ్ళ వాళ్ళనే చంపుకోవలసి వస్తోందని బాధ పడ్డారు. ఏవో కుంటి సాకులు చూపిస్తూ యుద్ధం చేయడానికి కాలయాపన చేస్తూ వచ్చారు.

అప్పుడు ఆనెగొందిని పాలిస్తున్న జంబుకేశ్వర రాయలవద్దకి సుల్తాన్ దౌత్యులుగా విచ్చేసారిద్దరు దండనాయాకులూ. అక్కడే కొంత కాలముండి విషయాలు రాబట్టాలని అనుకున్నారు. సమయంలో శంకరాచార్య మఠం నుండి హంపీ విచ్చేసిన విద్యారణ్యస్వామి అనే ఒక పండితుణ్ణి వీళ్ళు కలవడం జరిగింది. ఈ విద్యారణ్య స్వామి కూడా ఓరుగల్లు ప్రాంత వాసే! ఆయనొక తెలుగు బ్రాహ్మణ కుటుంబంలో పుట్టాడు. శంకరాచార్యుల బోధలు విని ప్రభావితమై శృంగేరీ పీఠానికెళ్ళిపోయారని చెబుతారు. ఆ విద్యారణ్య స్వామి ప్రబోధం వల్లే ఆ దండనాయికులిద్దరూ ముస్లిం మతం వదిలేసి తిరిగి హిందూ మతంలోకి మారిపోయారు.

ఈలోగా ఒకరోజు తుగ్లక్ ఆనెగొందిని ముట్టడించాడు. ఆ యుద్ధంలో జంబుకేశ్వర రాయలు ఓడిపోయాడు. తుగ్లక్ తన తరపున ఒక ముస్లిం నాయకుణ్ణి ఆనెగొంది ప్రతినిధిగా ఉంచాడు. విద్యారణ్య స్వామి ప్రబోధం వల్ల ఆ దండనాయకులిద్దరూ ముస్లిం నాయకుణ్ణి లొంగదీసుకొని, ఆనెగొందిని తిరిగి స్వాధీన పరుచుకున్నారు. విద్యారణ్య స్వామే ఈ విరూపాక్ష దేవాలయంలో పూజలూ, దీక్షలూ చేసి, ఓ శుభ ముహూర్తాన దండనాయకులిద్దరి చేతా విజయనగర రాజ్య స్థాపన చేయించాడు.

అదీ ఈ విజయ నగరం వెనకాల వున్న కథ. "

వేదరాయ శర్మ చెప్పిన కథ ఎంతో ఉత్కంఠతతో విన్నాడు రేవన్న. రాయచూరు ప్రాంతంలో ముస్లిం సుల్తానుల గురించి అతనికి తెలుసు. వాళ్ళ అకృత్యాలు కొన్ని కొంతమంది చెప్పగా విన్నాడు.

"విజయ నగరం కథ బావుంది. ఎంతో ఉద్వేగభరితంగా ఉంది. ఇంతకీ ఇద్దరు దండనాయకులెవరో చెప్పలేదు మీరు?" రేవన్న ప్రశ్నించాడు.

"వాళ్ళిద్దరూ ఎవరో కాదు. మన దేవరాయల మహారాజు తాత గార్లయిన హరిహర రాయలు, బుక్క రాయల్లు. హరిహర రాయలు తరువాత బుక్క రాయలు పాలించాడు. అతని తరువాత హరిహరరాయలు కొడుకు రెండవ హరిహరరాయలు విజయనగరాన్ని పాలించాడు. ఆయన తదనంతరం ఆయన ముగ్గురి కొడుకుల్లో సింహాసనంపై పోరు మొదలయ్యింది. పెద్దవాడైన విరూపాక్ష రాయలే రాజవ్వాలనీ పెద్దలు నిర్ణయించారు. కానీ రెండోవాడైన బుక్కరాయలకది నచ్చలేదు. ఓ రాత్రి అన్నగారిని హతమార్చి తనే రాజ్యాధికారం చేపట్టాడు. కానీ రెండోవాడైన బుక్కరాయలకది నచ్చలేదు. ఓ రాత్రి అన్నగారిని హతమార్చి తనే రాజ్యాధికారం చేపట్టాడు. ఓ ఏడాది తిరక్కుండా అతనూ అదే కుట్రకి బలయ్యాడు. అతని తమ్ముడు దేవరాయలు అన్నగారిని చంపి తను రాజయ్యాడు. ఇదీ ఈ రాజ్య చరిత్ర.. "

ప్రస్తుత రాజు దేవరాయలు తన సొంత అన్నగారిని చంపాడాని ఆశ్చర్యపోయాడు రేవన్న.

"అదేమిటి స్వామీ, సొంత అన్నగారిని చంపి రాజ్యాన్ని పాలిస్తున్నాడా?"

వేదరాయ శర్మ నవ్వాడు.

"రాజకీయంలో తర్కమూ, న్యాయమూ ఉండదు నాయనా? ఉన్నదల్లా అధికార దాహం. రాజ్య కాంక్ష. ఆ వ్యామోహం అటువంటింది. అన్నగారిని చంపి రాజ్యం పొందాడన్న తప్పొకటీ మినహాయిస్తే దేవరాయలు ఎంతో విజ్ఞుడు. పాలనా దక్షుడు. ప్రజలంటే ప్రేమ ఉంది. పెద్దలంటే గౌరవం వుంది. ఇతని అన్న రెండో బుక్కరాయలు అలా కాదు. ఎప్పుడూ మద్యం సేవిస్తూ స్త్రీ లోలుడై ఉండేవాడు. పరిపాలన్ని పట్టించుకోలేదు. దండనాయకుల వత్తిడితో దేవరాయలు అలా చేయక తప్ప లేదు. ఈ రాజ్యానికి దేవరాయలే సరైన రాజు."

"మన మహారాజు గురించి నేవిన్నది నిజమేనా?" రేవన్న అనుమానంగా అడిగాడు.

"ఈయన కూడా స్త్రీలోలుడనీ. పట్ట మహిషలు నలుగురే ఉన్నా, చాలామందిని వివాహం చేసుకున్నాడని ఎవరో చెప్పగా విన్నాను."

"నిజమేననుకో! కానీ ఆయన ఈ స్మామాజ్యానికి రాజు. కాదనే హక్కు ఎవరికుంటుంది చెప్పు? కామాన్ని జయించడం అంత సులభం కాదు నాయనా? ముగ్గురు పట్ట మహిషిలున్నా ఇంకా చాలనట్లు మరో ఆవిణ్ణి పెళ్ళి చేసుకున్నాడు. అన్నట్లు నువ్వు రాణిని చూసావా? నేనూ ఇదే చూడ్డం. అందరిలోకీ మొదటి రాణే కాస్త నయంగా ఉంటుంది"

"కొత్త మహారాణిని చూసాను. ఇక్కడికొచ్చాక అందరూ ఆవిడ అందాన్ని ఆహా ఓహో అని పొగుడుతూ ఉంటే ఏమిటో అనుకొని ఆశ్చర్య పోయాను. తీరా చూస్తే పసిమి చాయ తప్ప ఆమె మొహంలో కళ లేదు."

"అవును. నాకూ అలానే అనిపించింది. దేవరాయల రంగు తక్కువయినా ముఖంలో వర్చస్సు ఉంది. అతని రూపానికి తగినట్లుగా అనిపించలేదు. అసలేమే కాదు. మిగతా రాణులు కూడా అంత అందంగా అనిపించలేదు..."

అందం అనగానే ప్రియురాలు గుర్తొకొచ్చింది రేవన్నకి. పసిమి చాయ, కోటేరు లాంటి ముక్కు, మీనాల్లాంటి కళ్ళూ, పొడవైన నల్లని కురులూ - ఎంతో నాజూగ్గా ఉండే శరీరం..అందానికొక నిర్వచనం ఆమె. అప్సరసలా ఉంటుంది. అన్నింటికీ మించి చక్కని గాత్రమూ, నాట్యమూ ఆమె భరణాలు. ప్రియురాలు గుర్తుకు రాగానే అప్రయత్నంగా చిరునవ్వు అతని మొహమ్మీద నాట్యం చేసింది.

విరూపాక్షాలయంలో మొదలు పెట్టి దారిపొడుగునా విజయనగర చరిత్ర చెబూతూంటే అస్సలు శ్రమే తెలీలేదు రేవన్నకి. వారుండే విడిది దగ్గరకొచ్చేసారు. అయినా రేవన్న తనలో తను చిన్నగా నవ్వుకోడం మానలేదు. అది గమనించిన వేదరాయశర్మ - "ఎందుకు నవ్వు తున్నావు?" అనడిగాడు.

రేవన్న ఏమీ లేదని చెప్పాడు. వేదరాయ శర్మ పసివాడేమీ కాదు. అతనికి అర్థమయ్యింది.

"ఏదో ఉంది. చెప్పు." గురువు గారు రెట్టించారు.

"ఏమీ లేదండీ? మనతో పాటు మా అమ్మా నాన్నా కూడా వచ్చి ఈ విజయనగర వైభవాన్ని చూసుంటే బావుండేది కదా? అనిపించిందంతే " రేవన్న అబద్ధం చెప్పాడు.

నిజం చెప్పే ధైర్యం అతనికి లేదు.

గుర్తొచ్చింది తల్లీ, తండ్రీ కాదు. నేహల.

అతని - ప్రియురాలు - ముగ్ధరాలు. జీవితం - సర్వసం.

అతని ప్రణయ జీవిత వెన్నెల **నేహల..!!**

(కొనసాగింపు వచ్చేసంచికలో)